క్లుప్తంగా

పైడిమాంబ మారు పండగ నేడు



పరవాడ: మండల కేంద్రం పరవాడ గ్రామంలో కొలువుదీరిన పైడిమాంబ అమ్మవారి మారు వారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆర్థిక సాయంతో భారీ అన్న సమారాధన జరపనున్నారు. పరవాడ పరిసర గ్రామాల భక్తులు విచ్చేసి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించాలని ఉత్సవ కమిటీ కోరింది.

సీసీ రోడ్డు నిర్మించాలని వినతి

పరవాడ: మండలంలో వెన్నలపాలెం దరి హనుమాన్ కాలనీలో యలమంచిలి సన్యాసి రావు ఇంటి నుంచి పైల నారాయణ షెడ్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన యలమంచిలి నూకప్పారావు అనకాపల్లి జిల్లా కలెక్టరును కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ రోడ్డు నిర్మాణం చేపట్టలేదని వాపోయారు. సదరు స్థలంలో రోడ్డు నిర్మాణానికి అంగీకార పత్రాన్ని కూడా పంచాయతీరాజ్ డీఈకి గత నెల్లో అందించామన్నారు. అనంతరం పలు పర్యాయాలు అధికారులను సంప్రదించినా ఫలితం కనిపించలేదని వాపోయారు. త్వరితగతిన ఈ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు అందించిన వినతిపత్రంలో నూకప్పారావు కోరారు.

పోలీస్ స్టేషన్ వద్ద మజ్జిగ చలివేంద్రం



మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు ముందుకు వచ్చి జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. దాదాపు వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వేసవి ముగిసే వరకు ఇక్కడ చలివేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు. ఎస్‌ఐలు అసిరితాత, స్వామి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రాంతినగర్‌లో హైమాస్ట్ లైటు ప్రారంభం



హైమాస్ట్ లైటు ప్రారంభిస్తున్న శానాపతి వసంత

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని క్రాంతినగర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైటును కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు సోమవారం ప్రారంభించారు. నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బార్లలో పోలీసుల తనిఖీలు

విశాఖ సిటీ: విశాఖలో బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌లపై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. సుమారు 450 పోలీస్ అధికారులు, సిబ్బందితో 92 బృందాలుగా 104 బార్లు, పబ్‌ల్లో ఏకకాలంలో తనిఖీ చేపట్టారు. ఇందులో సంబంధిత శాఖల నుంచి లైసెన్సులు లేకుండా వ్యాపారం, మైనర్లకు మద్యం విక్రయాలు, ఫైర్ ఎన్‌ఓసీలు, సీసీటీవీ, అక్రమ మద్యం, ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయాలు ఇలా అనేక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో 23 బార్లలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. 14 బార్లకు ఫైర్‌ఎన్‌ఓసీ, 2 బార్లలో సీసీటీవీ కెమెరాలు, ఒకచోట ఫుడ్ లైసెన్స్ లేకుండా రెస్టారెంట్ నిర్వహణ, ట్రేడ్ లైసెన్సులు లేకుండా 2, పార్కింగ్ సదుపాయం లేకుండా 14, జీఎస్టీ లేకుండా ఒక బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహిస్తున్నట్లు తేల్చారు. సదరు బార్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సిఫార్సు చేశారు.

రేపు ఐటీఐలో జాబ్ మేళా

పెదగంట్యాడ: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో ఈ నెల 19న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి శాఖ సంయుక్తంగా ఐటీఐ పాస్ అయిన, అప్రెంటిస్ , డిగ్రీ , డిప్లమో, ఇంజినీరింగ్ అభ్యర్థులకు గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, వరుణ్ మోటార్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, వీల్స్ ఇండియా లిమిటెడ్ తదితర కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,744 నుంచి రూ.27వేల వరకూ జీతంతో పాటు వసతి, భోజన సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 19న ఉదయం ఐటీఐలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

హద్దుమీరుతున్న ఆకతాయిల ఆగడాలు

20 రోజుల క్రితం:

సుజాతనగర్ 80 అడుగుల రోడ్డు. అర్ధరాత్రి అయినా జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతం. 20 రోజుల క్రితం రాత్రి 10 గంటల సమయంలో దుర్గాప్రసాద్ అనే యువకుడు బైక్‌పై వస్తున్నాడు. అక్కడ మద్యం మత్తులో ఉన్న ఓ ఆకతాయి అతడ్ని ఆపాడు. సెల్‌ఫోన్ లాక్కునే ప్రయత్నం చేశాడు. ప్రతిఘటించడంతో ఆ ఆకతాయి తన వద్ద ఉన్న కత్తితో దుర్గాప్రసాద్‌పై దాడికి దిగాడు. బాధితుడు తప్పించుకుని పోలీసులను ఆశ్రయించాడు.

రెండు నెలల క్రితం:

వేపగుంట సమీపంలోని అప్పన్నపాలెం వద్ద ఓ యువకుడు ఆటో గ్యారేజ్ నిర్వహిస్తున్నాడు. రాత్రి 11 గంటల సమయంలో తాగిన మత్తులో ఉన్న ఐదుగురు వ్యక్తులు ఆ యువకుడ్ని కర్రలతో చితకబాదారు. రక్తపు మడుగులో నేల కొరగడంతో చల్లగా జారుగుతున్నారు. మరుసటి రోజు వారి గుర్తించి పోలీసులకు అప్పగిస్తే మద్యం మత్తులో వేరే వాడు అనుకుని అతన్ని కొట్టినట్లు చెప్పారు. కొందరు నాయకుల జోక్యంతో కేసు రాజీ కుదిరింది.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, గంజాయి సేవనం

మత్తులో విచక్షణా రహితంగా దాడులకు దిగుతున్న వైనం

వరుస ఘటనలతో శివారు ప్రాంత ప్రజల్లో ఆందోళన



వేపగుంట దరి పద్మనాభనగర్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



నాయడుతోటలో మద్యం బెల్ట్ దుకాణం వద్ద జరిగిన గొడవలో గాయపడ్డ వ్యక్తి(ఫైల్)



ఇటీవల సుజాతనగర్‌లో ఆకతాయిల చేతిలో గాయపడ్డ యువకుడు

పెందుర్తి:

పట్టణ, మండల పరిధి గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల పెరుగుతున్న ఆకతాయిల వికృత చేష్టలకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రుళ్ల విధులు ముగించుకుని ఇళ్లకు చేరేవారి పరిస్థితి మరింత భయానకంగా ఉంది. జనవరిలో నాయడుతోట సమీపంలోని బెల్ట్ దుకాణం వద్ద అర్ధరాత్రి సమయంలో ఇద్దరు వ్యక్తుల మధ్యలో స్వల్ప వివాదం జరిగి, చరణ్ అనే వ్యక్తిపై అవతలి వైపునున్న రౌడీషీటర్ విచక్షిణారహితంగా బ్లేడ్‌తో దాడికి దిగాడు. ఆ యువకుడు తప్పించుకోవడంతో ప్రాణాలు దక్కించుకున్నాడు. ఇలాంటి వరుస సంఘటనలతో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. రెండు రోజుల క్రితం వేపగుంట దరి పద్మనాభనగర్ ప్రజలు తమ ప్రాంతంలో ఆకతాయిల ఆగడాలు, గంజాయి, మద్య సేవనంపై పెందుర్తి పోలీసులకు లిఖిత పూర్వక ఫిర్యాదు ఇచ్చారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

దారి దోపిడీలతో భయాందోళన

పట్టణ శివారు ప్రాంతాల్లో ఆకతాయితనం శృతి మించుతోంది. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, గంజాయి సేవనంతో పాటు ఇతర మత్తు పదార్థాల వినియోగం ఎక్కువైంది. ఆ మత్తులో సామన్యులపై దాడులకు దిగుతున్నారు. దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. ప్రతిఘటించిన వారిపై హత్యాయత్నాలకు కూడా పాల్పడుతున్నారు. గత రెండు మూడు నెలల్లో ఇలాంటి ఘటనలు పెందుర్తి ప్రాంతంలో విపరీతంగా పెరిగాయి. విచ్చలవిడిగా మత్తుపదార్థాల లభ్యతతో పాటు జనావాసాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న మద్యం బెల్ట్ దుకాణాలే కారణమని తెలుస్తోంది.

పెరుగుతున్న 'మత్తు'

గతంతో పోల్చితే పెందుర్తి ప్రాంతంలో మద్యంతో పాటు గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అన్ని సమయాల్లోనూ అందుబాటులో ఉంటున్నాయి. బెల్ట్ దుకాణాలు ఎక్కడిక్కడ వెలిశాయి. పెందుర్తి అడ్డాగా గంజాయి అమ్మకాలు సాగుతున్నట్లు ఇటీవల కాలంలో జరిగిన కొన్ని ఘటనలు నిరూపిస్తున్నాయి. యువత మద్యంతోపాటు, గంజాయికీ అలవాటు పడుతున్నారు. రోడ్లు, పార్కులు, జనావాసాల్లోని ఖాళీ ప్రదేశాలు వీరి వికృత చర్యలకు వేదికలుగా మారుతున్నాయి.

పోలీసులకు సవాల్

పెందుర్తి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా రోజు రోజుకూ ఇలాంటి దాడులు పెరుగుతున్నాయి. మద్యం మత్తులో సామాన్యులపై ఆకతాయిలు దాడులకు పాల్పడడం పోలీస్ వర్గాల్లో సైతం కలవరం పెంచుతోంది. పెందుర్తి సర్కిల్ పెద్దది కావడంతో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు పూర్తిస్థాయి దృష్టి సారించలేకపోతున్నారు. గతం కంటే భిన్నంగా ఏడాదిగా రాజకీయ గొడవలు, ఇతర వివాదాల్లోనే నిత్యం పోలీసులు తలమునకలైపోతున్నారు. దీంతో శివారు ప్రాంతాల్లో ఆకతాయిల ఆట కట్టించేందుకు తగిన సిబ్బంది లేరని పలు సందర్భాల్లో పోలీసులే ఒప్పుకున్నారు. ఈ క్రమంలో తాజాగా పెరుగుతున్న బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టడం పోలీసు అధికారులకు సవాల్‌గా మారింది.

నిఘా పెంచి ఆటకట్టిస్తాం..



ఇటీవల కాలంలో మత్తులో దాడులు జరుగుతున్న ఘటనలు పెరుగుతున్న మాట వాస్తవమే. ఆయా సందర్భాల్లో అక్కడి పరిస్థితిని బట్టి సదరు వ్యక్తులు దాడులు చేసుకుంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో గంజాయి, మద్యం పానం నియంత్రణపై దృష్టి సారించాం. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని విడిచెపెట్టేది లేదు. ఆకతాయిలు, రౌడీషీటర్ల వలన ఇబ్బందులు ఎదురైతే మా దృష్టికి తక్షణమే తీసుకురావాలి.

- కె.వి.సతీష్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పెందుర్తి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 10 వినతులు



జెడ్సీ హేమావతికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 10 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతుల్ని జోనల్ కమిషనర్ హేమావతి స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశీలు రద్దు చేయాలని వినతి

ఎన్ఏడీ కొత్త రోడ్డు నుంచి పెందుర్తి వరకు తోపుడు బళ్లు, ఇతర చిరు వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న వారి నుంచి ఆశీలు తీసుకోవడం నిలుపుదల చేయాలని ఏఐటీయూసీ నాయకులు జెడ్సీని కోరారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. చిరు వ్యాపారుల కోసం సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి హాకర్స్ జోన్ ఏర్పాటుచేయాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు ఎస్‌కె రెహమాన్, వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉన్న స్కిల్ హబ్‌లో హ్యాండ్ ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 3 నెలల పాటు జరిగే ఈ శిక్షణ కోసం 8వ తరగతి చదివి 18-45 ఏళ్ల వయసు కలిగిన మహిళలు అర్హులన్నారు. ఈ నెల 20లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 99669 65502 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా మొదలైన 'పది' పరీక్షలు



సరిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల వద్ద పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



రావలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న విద్యార్థులు



పెందుర్తి పరీక్ష కేంద్రం వద్ద పోలీసుల కాపలా

పెందుర్తి: నియోజకవర్గ పరిధిలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పెందుర్తి ప్రాంతంలో మొత్తం 14 కేంద్రాలలో 3,094 మంది విద్యార్థులకు గాను 3090 మంది తొలిరోజు పరీక్షకు హాజరయ్యారు. కేంద్రాల వద్ద ఉదయం నుంచి కోలాహలం నెలకొంది. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్‌లలో ఉచిత ప్రయాణం కల్పించినా మారుమూల ప్రాంతాల విద్యార్థులు ప్రైవేట్ వాహనాలనే ఆశ్రయించారు. పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేశారు.

పరవాడ: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో 14 జెడ్పీ హైస్కూళ్లకు చెందిన 1037 మంది, ప్రవేట్ స్కూళ్లకు చెందిన 14 మంది విద్యార్థులు కలిపి మొత్తం 1051 మంది ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాల్ టికెట్లు పొందారు. పెదముషిడివాడ పరీక్ష కేంద్రంలో 203 మంది, లంకెలపాలెంలో 296 మంది, పరవాడలో 240 మంది, వాడచీపురుపల్లిలో 179 మంది, పరవాడ బాలికల జెడ్పీ హైస్కూల్లో 223 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. తొలి రోజు పరీక్షలో పెదముషిడివాడ పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు ఎంఈవో దివాకరరావు తెలిపారు. ఉదయం 9.30 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు అరగంట ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులకు అవసరమైన మంచినీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను కల్పించారు. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో తెలిపారు.

సింహాచలం: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సింహాచలం దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాలలో 127 మందికి గాను 126 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.రాధాకృష్ణ తెలిపారు. మహాత్మా జ్యోతీబాపూలే ఏపీ బీసీ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలలో పూర్తిస్థాయిలో 180 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ సువర్ణజ్యోతి పేర్కొన్నారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో 200 మందికి 197 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి తెలిపారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం:మండలంలో 5 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన టెన్త్ పరీక్షలకు 940 మంది విద్యార్థులకుగాను 936 మంది హాజరుకాగా, 4 గురు గైర్హాజరైనట్లు ఎంఈవో లక్ష్మణరావు తెలిపారు. వీరిలో 928 మంది రెగ్యులర్, 12 మంది ప్రైవేట్ విద్యార్థులున్నారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 191 మంది, ప్రతిభ విద్యాలయంలో 239 మంది, సన్‌రిడ్జ్ హైస్కూల్లో 144 మంది, మదర్ పబ్లిక్ స్కూల్లో 238 మందికి 236, రావలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్లో 128 మందికి 126 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనల్లేకుండా, తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు వెల్లడించారు.

నేడు పోలిపిల్లమ్మ వార్షిక పండగ



సింహాచలం: 98వ వార్డు పరిధి అప్పన్నపాలెంలో కొలువైన పోలిపిల్లమ్మ వార్షిక పండగ మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారికి విశేష పూజలు జరపనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద క్యూలను ఏర్పాటు చేశారు. ఆలయానికి, ఆలయం ఎదురుగా ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డులో విద్యుద్దీపాలంకరణ చేశారు. భక్తులకు మజ్జిగ, మంచినీరు, ఉచిత ప్రసాద వితరణ చేయనున్నారు. రాత్రి నెమలి నృత్యం, కేరళ డ్రమ్స్, కోలాటం, తీన్‌మార్ డ్యాన్స్ తదితర ప్రదర్శనల నడుమ అనుపు మహోత్సవాన్ని భారీ స్థాయిలో నిర్వహించనున్నారు. 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి, పీతల శివగణేష్ ఆధ్వర్యంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వీటితోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పలు నృత్య కార్యక్రమాలు, బుర్రకథ ప్రదర్శించనున్నారు.

పోలమాంబ పండగకు ఏర్పాట్లు

93వ వార్డు పరిధి గొల్లనారాయణపురంలో వేంజేసిన పోలమాంబ అమ్మవారి ఆలయంలో వార్షిక పండగను మంగళవారం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. అమ్మవార్లను భక్తులు, గ్రామస్తులు దర్శించుకుని ఆశీస్సులు పొందాల్సిందిగా ఆయా ఆలయ కమిటీలు తెలిపాయి.

అమ్మవార్ల పండగలకు వేళాయె



వెంకటపతిపాలెం ముత్యమాంబ అమ్మవారు



భర్నికంలో కొలువుదీరిన పరదేశిమాంబ



విద్యుత్ దీపాలంకరణతో ధగధగలాడుతున్న ముత్యమాంబ ఆలయం

పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, భర్నికం గ్రామాల ఆరాధ్య దేవతలు ముత్యమాంబ, పరదేశిమాంబ పండగలను మంగళవారం వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు విస్తృత ఏర్పాట్లు చేశాయి. వెంకటపతిపాలెం సమీపంలో కొలువుదీరిన ముత్యమాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ముఖద్వారాన్ని పూలు, విద్యుత్ తోరణాలతో తీర్చిదిద్దారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం వేకువ జాము నుంచి అమ్మవారి దర్శనం కోసం విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు, మంచినీరు, మజ్జిగ, ఉచిత ప్రసాద వితరణ ఏర్పాట్లు చేశారు. రాత్రికి అమ్మవారిని పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, కోలాటాలు, నేల డ్యాన్సులతో ఊరేగించనున్నారు. భారీ బాణ సంచా వెలుగుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పరదేశిమాంబ పండగ ఏర్పాట్లు

భర్నికం గ్రామంలో కొలువుదీరిన పరదేశిమాంబ అమ్మవారి పండగ కోసం ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. గ్రామంలోని వీధులకు విద్యుత్ తోరణాలు వేలాడదీశారు. మంగళవారం వేకువ జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భారీ సంఖ్యలో తరలి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రాత్రికి చిడతలు, డప్పులు, భజనలు, కోయ డ్యాన్సులు, నేల డ్యాన్సులతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించనున్నారు. అనంతరం భారీ బాణ సంచా వెలుగుల మధ్య అనుపు మహోత్సవాన్ని జరపనున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు.

అప్పన్న సన్నిధిలో 'కోర్టు' చిత్ర బృందం



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న నటులు శివాజీ, ప్రియదర్శి, కాకినాడ శ్రీదేవి, హర్షరోషన్

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం కోర్టు సినిమా యూనిట్ దర్శించుకుంది. ఆ చిత్రంలోని నటీనటులు శివాజీ, ప్రియదర్శి, హర్ష రోషన్, కాకినాడ శ్రీదేవి తదితరులు స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. ఆలయంలోని కప్పస్తంభానికి ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు.

మందుబాబులకు జరిమానా

- ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 13 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.30 లక్షలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. పట్టణ పరిధిలో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని న్యాయస్థానం ఎదుట హాజరుపరిచనట్లు పేర్కొన్నారు. ఇందులో విజయనగరం జిల్లా జన్ని వలసకు చెందిన కోరాయ మహేష్ అనే వ్యక్తికి జరిమానా కట్టని కారణంగా మూడు రోజుల జైలు శిక్ష పడినట్లు పేర్కొన్నారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై, మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. నూతన మోటారు వాహన చట్టం నిబంధనల మేరకు అపరాధ రుసుములు భారీగా పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు.

అదృశ్యమైన యువకుడి ఆచూకీ లభ్యం

పెందుర్తి: అదృశ్యమైన ఓ యువకుడి కేసును పెందుర్తి పోలీసులు ఛేదించి, అతడ్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాయుడుతోట ప్రాంతానికి చెందిన జూజూరు శివ గణేష్(23) ఈ నెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా సీఐ కె.వి. సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ స్వామి దర్యాప్తు చేపట్టారు. నగరంలో తిరుగుతున్న గణేష్‌ను సోమవారం ఉదయం గుర్తించి అతడ్ని సురక్షితంగా తల్లికి అప్పగించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ పంటలను కొనుగోలు చేసి స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో పద్మజ తదితరులు

సబ్బవరం: ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పంటలను ఆహారంలో భాగంగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎంపీడీవో పద్మజ తెలిపారు. స్థానిక మండల పరిషత్ అవరణలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన ఉద్యాన పంటలను విక్రయించేందుకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమవారం ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో రైతులు పండించే ఉత్పత్తులను విక్రయించేందుకు స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకృతి వ్యవసాయం మండల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్(ఎంసీఆర్పీ) జె.శ్రీనివాస్ తెలిపారు. డీపీఎం సీహెచ్ లచ్చన్న అదేశాలతో సబ్బవరం మండలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రోత్సహించడంతో పాటు, విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ స్టాల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇకపై ప్రతి సోమవారం ఈ స్టాల్ ద్వారా సబ్బవరంలో ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి, మండల పరిషత్ ఏవో శివప్రసాద్, ఎంసీఆర్పీలు ఇ.లక్ష్మణరావు, జి.లక్ష్మి, వై.లక్ష్మితో పాటు ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

మూగజీవాలపై ప్రేమకు నిదర్శనం



మూగజీవాలు తమ సమస్యను చెప్పుకోలేవు. మనమే తెలుసుకుని వాటికి చికిత్స అందించాలి. యజమానులు ఎంతో ప్రేమగా సాకుతుంటారు. అవసరమైప్పుడు వైద్యుల వద్దకు తీసుకెళ్లి చికిత్సలు అందిస్తారు. పలువురు జంతు ప్రేమికులు తమ కుక్కలను వైద్యం కోసం సోమవారం తమతో పాటు ద్విచక్రవాహనాలపై కూర్చోపెట్టుకుని, చేతి సంచిలో ఎండ తగలకుండా.. ఇలా అనేక విధాలుగా ప్రభుత్వ పశువైద్యశాలకు తీసుకువచ్చారు.

ఫొటోలు: సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం